# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 28 జూలై-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## సిరిసిల్ల విద్యార్థికి కెటిఆర్ అండ



## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే



# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం
- విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
- అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి





**ఖమ్మం,జూలై27 :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో మిగతా 3లో..

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

- మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు
- గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా



**న్యూఢిల్లీ,జూలై27 :** పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు మిగతా 3లో..

## విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

- ప్రభుత్వ ఉద్యోగాలు అంగడి సరుకు కాదు
- కరూరు బాధితులకు ఉద్యోగాల కల్పపై ఆక్షేపణ



**చెన్నై,జూలై27 :** తమిళనాడు సిఎం విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని మిగతా 3లో..

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సర్కార్ అండ?



- న్యాయపరమైన పోరాటానికి సిద్ధం అవుతున్న ప్రభుత్వం
- న్యాయ కోవిదులతో చర్చించి అప్పీల్ చేసే అవకాశం
- హైడ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్






**హైదరాబాద్, జూలై 27:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను మిగతా 3లో..

# ఆందోళనల నడుమే లోక్‌సభ వాయిదా



### పేపర్ లీకుల బిల్లుపై నేడు చర్చ

**న్యూఢిల్లీ,జూలై27 :** విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ మంగళవారానికి వాయిదా పడింది. పేపర్ లీకులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లు ఇవాళ లోక్‌సభ ముందుకు వచ్చినా.. బిల్లుపై చర్చించడం సాధ్యం కాలేదు. ఓ వైపు విపక్షాల ఆందోళనలు కొనసాగుతుండగానే.. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఉదయం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

## జూరాలకు పెరుగుతున్న వరద

- నెట్టెంపాడు, కోయిల్ సాగర్ మోటర్లు ఆన్ చేయాలి
- మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



**మహబూబ్ నగర్,జూలై27 :** జూరాల ప్రాజెక్టుకు 27,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, మోటార్లును ఎందుకు ప్రారంభించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టులో ఇప్పటికే 7.1 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకుందని వెల్లడిం

# వరుస నష్టాలకు బ్రేక్



- లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై,జూలై27 :** వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్ల పాటు నష్టాలను చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం బలంగా పుంజుకున్నాయి. కొనుగోళ్లు ఊపందుకోవడంతో ప్రధాన సూచీలన్నీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 776.01 పాయింట్లు ఎగబాకింది. నిఫ్టీ 228.5 పాయింట్లు పెరిగి 24 వేల మార్కుకు చేరువైంది. ప్రపంచ మార్కెట్ ర్యాలీ సహా అమెరికా, ఇరాన్‌లు సైనిక దాడులను నిలిపివేస్తామనే నిర్ణయం నేపథ్యంలో ముడి చమురు ధరలు తగ్గ డంతో భారత ఈక్విటీలు ఈ వారాన్ని బలంగా ప్రారంభించాయి. ఐటీ,మీడియా, రియాల్టీ, ఆటో, ఫార్మా రంగాల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ఇక రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ మీడియా సూచీ 2.50 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలి చింది. మరోవైపు.. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ మాత్రం స్వల్ప నష్టం(0.12శాతం)తో ముగిసింది. నిఫ్టీ సూచీలో ఎటర్నల్, ఇంట ర్గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, బజాజ్ ÷నాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు గరిష్ఠ లాభాలను నమోదు చేయగా.. ఓఎన్‌జీసీ, సిఎ÷-లా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు ఒత్తిడికి లోనై నష్టాలను చవిచూశాయి. అటు.. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో రూపాయి కూడా బలపడింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 68 పైసలు పెరిగి డాలర్‌కు ?95.89 వద్ద ముగిసింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి ?96.57 వద్ద ముగిసింది.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్



- కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

**న్యూఢిల్లీ,జూలై27 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి మిగతా 3లో..

## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ





- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

**హైదరాబాద్,జూలై27 :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

- ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ డిమాండ్



న్యూఢిల్లీ, జూలై 27 : దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణెళి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

# డ్రగ్స్ మత్తులో పోలీసులపై కారుతో దూసుకెళ్లిన యువకుడు

- కానిస్టేబుల్‌కు గాయాలు.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
- హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు



హైదరాబాద్,జూలై27 : డ్రగ్స్ మత్తులో ఉన్న ఓ యువకుడు తనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైకే కారుతో దూసుకెళ్లిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ హెడ్ కానిస్టేబుల్ కాలుకు తీవ్ర గాయాలు కాగా, ఇన్‌స్పెక్టర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నిందితుడు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే ఆయన ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అబిడ్స్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఓ కారు అబిడ్స్ చేరుకుంది. కారులోని వ్యక్తికి మరో వ్యక్తి వచ్చి అనుమానాస్పద ప్యాకెట్ అందజేయగా, అక్కడే మాటువేసిన పోలీసులు ప్యాకెట్ ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కారులో ఉన్న నిందితుడిని బయటకు దిగాలని ఆదేశించారు.యితే కారు పక్కకు తీస్తున్నట్లు నటించిన నిందితుడు ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా నడిపాడు. ఈ సమయంలో అడ్డుకునేందుకు ప్రయత్నించిన హెడ్ కానిస్టేబుల్ మహేందర్ కాలు మీదుగా కారును ఎక్కించడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో పాటు మరో కానిస్టేబుల్‌కు కూడా గాయాలయ్యాయి. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, ఇన్‌స్పెక్టర్ తన బృందంతో కలిసి వెంటాడారు. అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో కారును అడ్డుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌గా పోలీసులు గుర్తించారు.రోవైపు, కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌ను వెంటనే సోమాజిగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్ కాలును పరీక్షించిన వైద్యులు విరిగినట్లు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. మహేందర్ ఫిర్యాదు మేరకు నిందితుడు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం సైఫ్‌ను అదుపులోకి తీసుకుని డ్రగ్స్ వ్యవహారంతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

# బీహార్ బంద్‌లో ఎకె 47తో కాల్పులు



- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు

పాట్నా,జులై 27 : రెండు రోజుల క్రితం 'బిహార్ బంద్' సందర్భంగా శివాన్ జిల్లాలో చోటుచేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై ఒక పోలీసు సిబ్బంది'ఏకే-47'రైఫిల్‌తో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయింది. ఈ ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈనెల 25న బిహార్‌లో విద్యార్థి సంఘాలు చేపట్టిన ఈ బంద్ సందర్భంగా పలు జిల్లాల్లో నిరసనకారులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని పాట్నాలోని జయ ప్రభ మేదాంత ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో 15 ఏళ్ల మహమ్మద్ ఆరిఫ్ అనే యువకుడు కూడా ఉన్నాడు. బంద్ కారణంగా దుకాణం మూసివేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా మెడకు బులలెట్ తగిలిందని కుటుంబసభ్యులు తెలిపారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి బుల్లెట్‌ను తొలగించారని, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కాల్పుల ఘటనపై ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేస్తూ... కాల్పుల ఘటనకు సంబంధించిన వీడియోను నెట్‌లో షేర్ చేశాడు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ.. ఢిల్లీలో నిరసన తెలిపే విద్యార్థులపై పె÷-లలెట్ తుపాకులు, బిహార్‌లో ఏకే-47లు ప్రయోగిస్తున్నారంటూ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

# టోరంటోలో దారుణ ఘటన




## భారత సంతతి యువతిపై కాల్చివేత

టోరంటో,జులై 27 : కెనడాలోని టొరంటో నగరంలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. 26 ఏళ్ల భారత సంతతికి చెందిన నవ్‌నీత్ కౌర్ అనే యువతిని ఓ వ్యక్తి దారుణంగా కాల్చి చంపాడు. ఇది ఒక పథకం ప్రకారం జరిగిన దాడి అని టొరంటో పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. శుక్రవారం ఉదయం 7:23 గంటల ప్రాంతంలో హంబర్‌వుడ్ బౌలేవర్డ్, రెక్స్‌డేల్ బౌలేవర్డ్ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రత్యక్షసాక్షి తెలిపిన వివరాల ప్రకారం.. నవ్‌నీత్ కౌర్ వీధిలో నడుచుకుంటూ వెళుతుండగా, సదరు వ్యక్తి ఆమెను అనుసరించాడు. అతడు ఏదో మాట్లాడటంతో నవ్‌నీత్ వెనక్కి తిరిగి చూసింది. వారిద్దరి మధ్య స్వల్ప సంభాషణ జరిగింది. ఎలాంటి గొడవ లేదా వివాదం జరిగిన సూచనలు కనిపించకుండానే, అతడు వెంటనే తుపాకీ తీసి ఆమెపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన నవ్‌నీత్‌కు అత్యవసర వైద్య సాయం అందించినప్పటికీ, ఆమె అక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన టొరంటో పోలీసులు, నిందితుడిని పట్టుకోవడానికి డ్రోన్లు, ప్రత్యేక డాగ్ స్క్వాడ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం నాటికి ఈ హత్య కేసులో నిందితుడైన 37 ఏళ్ల శరంజిత్ సింగ్ అనే వ్యక్తిని బ్రాంప్టన్ వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. నిందితుడిపై ముందస్తు ప్రణాళికతో చేసిన హత్య),కోర్టు నిబంధనలను ఉల్లంఘించినట్లు కేసులు నమోదు చేశారు. హత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ కేసుపై పోలీసుల హోమిసైడ్ టీమ్ విచారణ జరుపుతోంది. ఈ దాడిలో ఇతర నిందితుల ప్రమేయం ఏమీ లేదని, ఇది పూర్తిగా టాగంటెడ్ దాడిగా భావిస్తున్నామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు లేదా 'క్రైమ్ స్టాపర్స్'కు తెలపాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

## రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్, జూలై 27: వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేయడంపై బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయస్థానం ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని హైకోర్టు తెలిపిందన్నరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని ఇవాళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయింది. లక్షమంది పోలీసులున్న ఈ రాష్ట్రంలో హోంమంత్రి అయిన సిఎం హైకోర్టు స్థానిక పోలీసులెవరూ కూడా తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడలేరు. అందుకు ఆర్మీ అధికారులను ఆదేశించింది.. అంటే అసలు మీకు ఇక నైతిక హక్కు ఎక్కుడుందని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దొడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు లేకుండా బదలాయించారు. అందుకే నేను గతంలో తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసిన మీ అధికారిగా, సోదరుడిగా, ప్రభుత్వ అధికారులకు చెబుతున్నా దయచేసి రాజ్యాంగాన్ని పాటించండి. చట్టాన్ని పాటించండి.. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సర్కార్ అండ?



- న్యాయపరమైన పోరాటానికి సిద్ధం అవుతున్న ప్రభుత్వం
- న్యాయ కోవిదులతో చర్చించి అప్పీల్ చేసే అవకాశం
- హైడ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్

హైదరాబాద్, జూలై 27: డా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీ పంపించారు. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయ పడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో న్యాయ సలహాలు తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోందని సమాచారం. ఇదిలావుంటే హైదరాడ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్ చేసింది. రాష్ట్రంలో హైడ్రాను నిషేధిస్తే పేదల ఇళ్లు సురక్షితంగా ఉంటాయని తెలంగాణ బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ అంశంపై సోమవారం ఆయన స్పందించారు. ఈ తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని అభివర్ణించారు. రంగనాథ్‌ను బలిపశువు చేశారని చెప్పారు. రేవంత్, ఎంఐఎం కనుసన్నల్లో హైడ్రా నడిచిందని విమర్శించారు. ఫాతిమా కాలేజీ, బడాబాబుల జోలికి హైడ్రా వెళ్లడంలేదని గుర్తు చేశారు. తొలి నుంచి పేదల ఇళ్లే హైడ్రా టార్గెట్ చేసిందని మండిపడ్డారు. హైడ్రాను రద్దు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను టీబీజేపీ చీఫ్ రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. కోర్టు ఆదేశాలను ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు స్వాగతించాయి.

# విద్యార్థులకు ఉచితంగా రైటింగ్ బోర్డుల పంపిణీ

నిజామాబాద్,జూలై27 : నిజామాబాద్ మండల పరిధిలోని మల్లారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో కేజీఎఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఉచితంగా రైటింగ్ బోర్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఉఈ ట్రస్ట్ ఫౌండర్ జేసీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రతీ చిన్నారికి విద్య, ఆరోగ్యం, క్రీడలు అనే మూడు ప్రధాన రంగాల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, ఆరోగ్య సేవలు, క్రీడా అవకాశాలను అందిస్తూ వారి భవిష్యత్ అభివృద్ధికి తమ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. , జనరల్ సెక్రటరీ నాగేందర్, ట్రస్ట్ సభ్యులు కలిసి విద్యార్థులకు రైటింగ్ బోర్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సేవ్లా, ప్రధానోపాధ్యాయులు అన్నం గోపాల్, ఉపాధ్యాయులు వెంకట్, రంగా కిషన్, ట్రస్టు జనరల్ సెక్రటరీ నాగేందర్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన

మంచిర్యాల,జూలై27 : మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. యూనియన్ బ్యాంకులో ఖాతాలు కలిగి ఉన్న కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 2024 ఒప్పందం ప్రకారం 70 ఏళ్లలోపు పెన్షనర్లకు రూ. 30లక్షల ప్రమాద బీమా. రూ. 10లక్షల సహజ మరణ బీమా కల్పించడంలో బ్యాంక్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు.సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా యూనియన్ బ్యాంక్ యజమాన్యం సింగరేణి రిటైర్డ్ బొగ్గు పెన్షన్ దారులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం, పది రోజుల్లోగా తమకు బీమా సౌకర్యం కల్పించకపోతే జిల్లా వ్యాప్తంగా కుటుంబాలతో సహా శాంతియుతంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సింగరేణి రిటైర్డు కార్మికులు పాల్గొన్నారు.

# కొల్వాయి ఎత్తిపోతలను ప్రారంభించండి

## రైతులతో కలసి పరిశీలించిన జీవన్ రెడ్డి

జగిత్యాల,జూలై27 : జగిత్యాల జిల్లాలోని బీర్పూర్ మండలం కొల్వాయి మండలం ఎత్తిపోతల పథకాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి సోమవారం రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కాలిపోయిన మోటార్లను పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం తో నీళ్లు అందక సాగు చేయడం లేదని రైతులు వాపోయారు. విద్యుత్ డీఈ, ఎస్ఈలతో జీవన్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు. కొల్వాయి ఆరేపల్లి లో మోటార్లు మరమ్మతు చేయించాలన్నారు.ఏడాదికాలంగా మరమ్మతులు చేపట్టడం లేదన్నారు.అధికారులు అంచనాలు రూపొందించేది ఎప్పుడు? నీళ్లు అందించేది ఎప్పుడని ప్రశ్నించారు. రైతుల అదృష్టం కొద్ది కాలువలో నీళ్లు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకునేందుకు మోటర్లు మరమ్మతు చేపట్టి పంపులు వినియోగించాలని కోరారు ఈనెల 31లోగా మోటార్ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల రీప్లేస్మెంట్ చేయగలిగితే ఖరీఫ్ పంట సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే పంటలు ఎండిపోవడానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నీళ్లు ఉండి కూడా పంటలు పండించుకోలేని దుస్థితి రాకుండా చూడాలని కోరారు. అన్ని పంపుసెట్లు వినియోగంలో తీసుకువచ్చి ఖరీఫ్ పంటకు నీరు అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనావేసేందుకు అధికారులు పంపుసెట్లు పరిశీలించాలని అధికారులకు సూచించారు.

# విదేశీ యువతి పట్ల అసభ్య ప్రవర్తన

హైదరాబాద్,జూలై27: కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. ఆయువతి.. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు.

# (మొదటిపేజీ తరువాయి)

## విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టి న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

## పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

## ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆదర్శంగా మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్

- స్కూల్‌ను సందర్శించిన సీ.ఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, జూలై 27 : మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిదునాక్షికంగా సందర్శించారు. సోమవారం మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరు స్తున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల సమయాల్లో విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సేవలను పాఠశాల వరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీ శశాంక్, శ్రీ కృష్ణ ఆదిత్య జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి, ఇసుక మాఫియాలకు తుమ్మల అండ

- మాజీమంత్రి పువ్వాడ అజయ్ ఆరోపణలు



ఖమ్మం,జూలై27 : ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మట్టి , ఇసుక మాఫియా లకు అండగా ఉంటూ ప్రోత్సహం ఇస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. రఘునాథ పాలెం మండలంలో అనేక మట్టి గుట్టలను అక్రమంగా తవ్వి దోచుకుంటున్నారని విమర్శించారు. గతంలో తప్పుడు ఆరోపణలు చేసిన వారే ఇప్పుడు అరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం నియోజకవర్గంలోని ఈర్లపూడి గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఆరోగ్యంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేశారని, తనకు ఏదో జరిగిపోయినట్లుగా అసత్య వార్తలు ప్రచారం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఆరు అడుగుల కటౌట్‌లా నిటారుగా నిలబడి ఉన్నానని, ఎప్పటికీ ప్రజల పక్షాన నిలిచి పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే చరమగీతం పాడతారని జోస్యం చెప్పారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తానని మాజీ మంత్రి పేర్కొన్నారు.

## ఆకివీడు రామాలయ నిర్మాణానికి సుప్రీం ఓకే

### అభ్యంతరాలు లేవంటూ పిటిషన్లు కొట్టివేత

న్యూఢిల్లీ,జూలై27 : పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో రామాలయ నిర్మాణానికి దేశ అత్యున్నత నాయస్థానం సుప్రీంకోర్టు ఆమోదముద్ర వేసింది. ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వివాదానికి సంబంధించి గతంలో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రం చట్టబద్ధమైనదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు లోబడి ఆలయ నిర్మాణం చేపట్టడంలో ఎలాంటి తప్పు లేదని వ్యాఖ్యానించింది. ఆలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌లో ఎలాంటి సత్యాలు లేవని పేర్కొంటూ కోర్టు దానిని త్రోసిపుచ్చింది. స్థానిక జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఎన్‌ఓసీ సరైనదేనని, దాంట్లో ఎలాంటి చట్ట ఉల్లంఘన జరగలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో రామాలయాన్ని నిర్మించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో ఆకివీడులో రామాలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. అత్యున్నత న్యాయస్థానం తీర్పు పట్ల స్థానిక ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణ రాజు సుప్రీం కోర్టు తీర్పు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ధర్మం గెలిచింది! శ్రీ రాముడు గెలిచాడు!! జై శ్రీ రామ్! అంటూ ఆయన తన ఎక్స్ ఖాతాలో స్పందించారు.

## సింగరేణి పరిధి గ్రామంలో ఉచిత వైద్యశిబిరం

### వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం,జూలై27 : సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో, వీకేసీఎం ప్రాజెక్టు ప్రభావిత, పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా సోమవారం గరీబ్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఆరోగ్య పరిరక్షణ, జీవనశైలి మార్పులు, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.ప్రజల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా సింగరేణి సంస్థ ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు సింగరేణి నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గరీబ్‌పేట్ సర్పంచ్ దివ్యతేజ, హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి, వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ ఎం.ఆర్.కే. ప్రసాద్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ గోపు కుమార్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



- ప్రభుత్వ విప్ వేముల వీరేశం

నల్లగొండ,జూలై27 : గ్రామీణ అభివృద్ధి, మహిళా సాధికారితే ప్రభుత్వ లక్ష్యం అని విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని మల్లారం గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, మహిళ సామాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ భవనాలు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించే కేంద్రాలుగా నిలువాలన్నారు. మహిళ సమాఖ్య భవన నిర్మాణంతో గ్రామీణ మహిళలకు ఆర్థిక, సామాజిక సాధికారత మరింత బలోపేతం అవుతుందని, మహిళా సంఘాల కార్యకలాపాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రామానికి 30 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు తన నిధులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ పుష్పలత, మండల ప్రత్యేక అధికారి సతీష్, ఎంపీడీఓ అంజన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, పీఆర్ ఏఈ సందీప్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పెద్ది నాగమణి మల్లేష్, ఉప సర్పంచ్ దండెంపల్లి జగదీష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు అయితగోని ఝాన్సీ, ఏపీఓ కడెం రాంమోహన్, నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకరబోయిన వెంకన్న, మాజీ అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు పెద్ది యాదగిరి పాల్గొన్నారు.

## విద్యార్థులపై దాడికి అమిత్ షా క్షమాపణలు చెప్పాలి: చామల



న్యూఢిల్లీ,జూలై27 : విద్యార్థులపై జరిగిన అమానుష దాడికి కేంద్ర హోంమంత్రి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో అంతా అయిపోయిందని కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటే ఉపేక్షించేది లేదు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలంటే ప్రభుత్వం భాధ్యతతో వ్యవహరించాలి. సింగపూర్, బ్రిటన్ లాంటి దేశాల్లో జెన్‌జీకి చట్టసభల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. భారత్‌లో కూడా 21 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న యువతకు చట్టసభలో ప్రాతినిద్యం కల్పిస్తే.. వారి సమస్యలపై పూర్తి అవగాహనతో చర్చించి, సమస్యలు పరిష్కారం చేయవచ్చు. ఈ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని ఇండియా కూటమి నేతలకు తెలంగాణ ముఖ్యమంత్రి వివరించనున్నారు' అని చామల తెలిపారు.

## యశోదలో పెద్దికి మంత్రి సీతక్క పరామర్శ



హైదరాబాద్, జూలై 27 : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్తితిపై మంత్రి సీతక్క ఆరా తీసారు. కుటుంబ సభ్యులను కలిసి దైర్యం తెలిపారు. పెద్దిని పరామర్శించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మంత్రి సీతక్క యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేటీఆర్ డాక్టర్లతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంసభ్యులను పరామర్శించిన కేటీఆర్, మంత్రి సీతక్క వారిలో మనోధైర్యాన్ని నింపారు. కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు.

## అంగన్‌వాడీలో తొలిముద్ద కార్యక్రమం ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం,జూలై27 : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలోని పంజాబ్‌గడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 'బాల భరోసా' కార్యక్రమంలో భాగంగా 'తొలిముద్ద' కార్యక్రమాన్ని కార్పొరేటర్ కంచర్ల హిమాశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాల భరోసా కార్యక్రమం అభినందనీయమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే టిఫిన్‌ను రుచికరంగా, నాణ్యంగా, పరిశుభ్రంగా తయారు చేసి సకాలంలో అందించాలని అంగన్‌వాడీ టీచర్లు ముంతాజ్, భాగ్యరేఖ, శైలజలకు సూచించారు. చిన్నారులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, శారీరక మరియు మానసిక వికాసం మెరుగుపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

# పంజాబ్‌లో మళ్లీ రైతుల ఆందోళన

- పంజాబ్‌లో మళ్లీ రైతుల ఆందోళన
- ఎన్నికల ముందు బిజెపికి కొత్త తలనొప్పి



చండీఘఢ్,జూలై27 : పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల ప్రధాన నరేంద్ర మోదీ ఆ రాష్ట్ర పర్యటనతో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అంశాలను తెరపైకి తీసుకువచ్చి, నూతన రాజకీయ ఒరవడిని సృష్టించాలని భావించిన బీజేపీకి.. ప్రస్తుతం ఇలా రైతులు ఆందోళనకు దిగడం సవాల్‌గా మారింది.భారత్-అమెరికా ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా వేలాది మంది రైతులు మరోసారి శంభు సరిహద్దు వద్ద గుమిగూడారు. వారిని ఢిల్లీ వైపు వెళ్లనీయకుండా హరియాణా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడి పరిస్థితులు 2020-21 వ్యవసాయ చట్టాల ఉద్యమం, 2024 అన్నదాతల ఆందోళనలను గుర్తుచేస్తున్నాయి. ఇరుదేశాల మధ్య ఈ ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే.. అమెరికా నుంచి భారీ సబ్సిడీలతో వచ్చే వ్యవసాయ, పాల ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి ప్రవేశించే అవకాశముందని రైతు సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ఫలితంగా.. దేశంలో రైతు ఉత్పత్తులకు ధరలు తగ్గి ఆదాయం దెబ్బతింటుందని వారు వాపోతున్నారు. మరోవైపు.. ఒప్పందం పూర్తయ్యే వరకు వేచి చూడాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ఆ తర్వాత రైతుల ప్రయోజనాలను కాపాడుకునే అవకాశం ఉండదని రైతు సంఘాలు వాదిస్తున్నాయి. ఈ అంశంపై పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్ స్పందిస్తూ.. ఇప్పటివరకు ఎలాంటి తుది ఒప్పందం కుదరలేదని, రైతులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. అన్నదాతలు, పశుపోషకుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని ప్రధాని మోదీ కూడా హామీ ఇచ్చారన్నారు. అయితే.. ఈ ప్రతిపాదిత ఒప్పందాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబడుతోంది. ఈ డీల్ ద్వారా వ్యవసాయం, పాల పరిశ్రమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆరోపిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఈ డీల్‌ను రైతులపై 'అతిపెద్ద ద్రోహం'గా అభివర్ణిస్తూ.. ముసాయిదా ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తోంది. అటు.. శిరోమణి అకాలీదళ్ కూడా ఈ ఉద్యమానికి మద్దతు తెలిపింది. పంజాబ్‌లో రైతులు మరోసారి ఇలా ఉద్యమ బాటపట్టడంతో ఎన్నికల వేళ అన్నదాతల సమస్యలే ప్రధాన చర్చాంశంగా మారే అవకాశం కనిపిస్తోంది. 2020లోనూ ఇదే తరహాలో సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టిన రైతులు.. మరలా ఇప్పుడు అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందానికి ప్రతికూలంగా ఆందోళనలకు దిగడం విశేషం. ఇదిలాగే తీవ్రరూపం దాల్చితే విదేశీ వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశంలో జరిగే తొలి భారీ రైతు ఉద్యమం కానుంది.

# కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

## బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఎపి

## విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం



న్యూఢిల్లీ,జూలై27 : కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోట్గి÷ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# కేంద్రం హామీలు బుట్టదాఖలు

- కేసుల ఎత్తివేతపై కదలిక లేని ఉత్తర్వులు
- ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ ఆందోళనలు
- న్యాయసాయం కోసం సాక్షి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం
- కాక్రోచ్ జనతాపార్టీ నేతల వెల్లడి




న్యూఢిల్లీ,జూలై27 : నిరసనకారులపై పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుల ఉపసంహారణనపై కేంద్రం తమకు ఇచ్చిన మాటను ఉల్లంఘిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆరోపించింది. మళ్లీ దేశవ్యాప్త నిరసనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. కేంద్ర విద్యశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ తన నిరసనను విరమించింది. కేంద్రంతో చర్చల సమయంలో విద్యార్థులపై కేసులు ఎత్తివేతపై కేంద్రం అంగీకరించిందని సీజేపీ చెబుతోంది. కేసులు విత్ డ్రా చేయకుపోతే నేటి నుంచి మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని మరియు వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలని సీజేపీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోందని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్‌లో ఆరోపించారు. బీహార్, బెంగాల్‌లలో వందలాది విద్యార్థులను అరెస్ట్ చేస్తున్నారని, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా ఉంచి వేధిస్తున్నారని, నిరసనకారులకు లాజిస్టిక్స్ సపోర్ట్ అందించిన వాలంటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుల్లో చిక్కుకున్న విద్యార్థుల న్యాయసహాయం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించినట్లు సీజేపీ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించు కుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళన కారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించు కోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, మరియు బీజేపీ పాలిత లేదా బీజేపీ ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసు బలగాలు కొత్త కేసులు నమోదు చేయకూడదని సీజేపీ డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో మళ్లీ నిరసనలో కూర్చుంటామని కేంద్రానికి అల్టిమేటం జారీ చేసింది. కేసులు ఎత్తేస్తామనే హామీని లిఖితపూర్వకంగా తమకు బుధవారం లోగా ఇవ్వాలని సీజేపీ కోరింది. సోమవారం నాడు సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది మరియు ఎస్పీ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో, సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించిన తర్వాత జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గుముఖం పట్టిన కొద్దీ విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారని తాము ముందే ఊహించామని తెలిపారు.

# సిరిసిల్ల విద్యార్థికి కెటిఆర్ అండ

- ఐఐటిలో సీటు సాధించినందుకు అభినందన
- ల్యాప్‌టాప్ బహుకరణ..ఫీజు చెల్లింపునకు హామీ



హైదరాబాద్, జూలై 27 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన ఔదార్యం చాటుచేసుకున్నారు. ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్‌కు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. కాలేజీ ఫీజును కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, శ్రీలతతో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన అభినవ్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించారు. అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం కింద ల్యాప్‌టాప్ అందజేశారు. అంతేకాకుండా అభినవ్ కాలేజీ ఫీజును కూడా తానే చెల్లిస్తానని భరోసా ఇచ్చారు.కేవలం చదువు మీద దృష్టి పెట్టి.. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినవ్‌కు కేటీఆర్ సూచించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు అభినవ్, అతని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి అందించిన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువబోమని, కేటీఆర్‌కు రుణపడి ఉంటామని అన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు ఇప్పించండి

నిజామాబాద్,జూలై27 : వీబీజీ రాంజీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలిప్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నాగిరెడ్డిపేట ఎంపీడీవో గంగాధర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్‌అసిస్టెంట్లు మాట్లాడుతూ మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ పథకంలో ఉన్న పనులతో పాటు ఇందిరమ్మ ఇల్లు, ఫొటో క్యాప్చర్, ఉపాధి కూలీల అటెండెన్స్, వనమహోత్సవం లాంటి అదనపు పనులు నిర్వర్తిన్నామని చెప్పారు. కానీ తమపై అదనపు పనుల భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకా తమకు సమయానికి జీతం ఇవ్వడం లేదని, ఇప్పటికైన తమకు ప్రతీ నెలా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సోమవారం నిర్వహించిన తమ శాఖ సమీక్ష సమావేశం బహిష్కరించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తమకు మూడు నెలల జీతం రాలేదని, దీంతో తమ కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఆ విమాన ప్రమాదం చిన్న ఘటన కాదు

- నివేదిక ఎప్పుడు అందేదీ ఇప్పడే చెప్పలేం
- అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై రాజ్యసభలో కేంద్రం



న్యూఢిల్లీ,జూలై27 : అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై రాజ్యసభలో కేంద్రం కీలక వ్యాఖ్యలు చేసింది. తుది నివేదికల విడుదలపై తలెత్తుతున్న ప్రశ్నలపై బదులిస్తూ.. ఈ కేసు దర్యాప్తులో ఎటువంటి ఆలస్యం జరగలేదని స్పష్టంచేసింది. అదేమీ చిన్న సంఘటన కాదని.. అటువంటి భారీ ప్రమాదాల దర్యాప్తును పూర్తి చేయడానికి సమయం పడుతుందని తెలిపింది. భారీ విమాన ప్రమాదాల దర్యాప్తు అనేక అంశాలు.. వేర్వేరు పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని..అందువల్ల తుది నివేదిక కోసం ఎంత సమయం పడుతుందనే విషయాన్ని ముందుగానే అంచనా వేయడంసాధ్యం కాదని వెల్లడించింది.ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందని పౌర విమానయానశాఖ పేర్కొంది. నిర్దేశిత విధానాల ప్రకార దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు వెల్లడించింది. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు ఎటువంటి తుది నిర్ణయానికి రాలేదని వెల్లడించింది. ప్రస్తుతం విమాన 'థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్' ను తనిఖీ చేసే పక్రియ జరుగుతోందని తెలిపింది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే

# మెట్రో ప్రయాణికులుకు మెరుగైన సేవలు

- మరింత సౌకర్యవంతంగా స్టేషన్లకు రూపకల్పన
- అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి



హైదరాబాద్,జూలై27 : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ఎ÷-లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు , ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు , మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ , పారిశుధ్య స్థితిగతులపై ఆయన సమీక్షించారు. ప్రయాణికులకు ఇచ్చే సేవలలో స్వచ్ఛత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్వహణ చూసే ఏజెన్సీల పనితీరును ఇంకా మెరుగుపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెట్రో స్టేషన్లను మరింత మోడల్‌గా తీర్చిదిద్దేందుకు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అజిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి, వాటిని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన అన్ని మెట్రో స్టేషన్లను కూడా స్వయంగా సందర్శించి, ప్రయాణికులకు అందే సౌకర్యాలు, పార్కింగ్, పారిశుధ్యం , భద్రతను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని తెలిపారు. నగరవాసులకు అత్యంత సురక్షితమైన , ప్రశాంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.



# విజయ్ సర్కార్‌కు గట్టి ఎదురుదెబ్బ!

**కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాల జీవో రద్దు**

**అలాంటి నియామకాలు రాజ్యాంగ విరుద్ధం: మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ సంచలన తీర్పు**

బలగం టీవీ, చెన్నై

తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ విజయ్ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ సోమవారం రద్దు చేసింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్.శక్తివేల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కారుణ్య నియామకాల కోసం ప్రభుత్వ శాఖల్లో ఎంతో మంది అర్హులైన అభ్యర్థులు ఏళ్ల తరబడి వేచి చూస్తున్న తరుణంలో, వారి అవసరాలను పక్కనపెట్టి ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది.

వెయిటింగ్ లిస్టును కాదని ఉద్యోగాలా? ఉద్యోగాల కోసం పెద్ద ఎత్తున అభ్యర్థులు వేచి చూస్తున్నారని, వారి హక్కులను కాలరాస్తూ కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు మాత్రమే ఇలాంటి ప్రత్యేక ఉపశమనం అందించడం తగదని ధర్మాసనం స్పష్టం చేసింది. "ఈ నియామకాలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 16 ప్రకారం దేశ పౌరులకు కల్పించిన సమానత్వపు హామీని ఉల్లంఘిస్తున్నాయి. ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలు ఎప్పుడైనా రాజ్యాంగ పరిమితులకు లోబడే ఉండాలి" అని మద్రాస్ హైకోర్టు తేల్చిచెప్పింది.

సుప్రీం కోర్టుకు టీవీకే ప్రభుత్వం! మరోవైపు, మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుపై టీవీకే సర్కార్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చెన్నై అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. బాధితులకు న్యాయం చేసే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, దీనిపై అప్పీలుకు వెళ్లేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.



# అమెరికాలో కాల్పుల కలకలం!

**'బైట్ ఆఫ్ సియాటెల్' ఫుడ్ ఫెస్టివల్‌లో దుండగుల ఘాతుకం**

**ఇద్దరు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు.. క్షతగాత్రుల్లో రెండేళ్ల బాలుడు**

బలగం టీవీ, వాషింగ్టన్/సియాటెల్

అమెరికాలో మరోమారు గన్ కల్చర్ పడగవిప్పింది. వాషింగ్టన్‌లోని సియాటెల్ నగరంలో ఆదివారం సాయంత్రం ఘోర కలికలం చోటుచేసుకుంది. అక్కడ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రముఖ 'బైట్ ఆఫ్ సియాటెల్' ఫుడ్ ఫెస్టివల్‌లో దుండుగులు జరిపిన అనాలోచిత కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాల్పుల శబ్దంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన జనాలు ప్రాణభయంతో పరుగులు తీయడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర అస్తవ్యస్తంగా మారింది.

ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక చర్యల బృందాలు క్షతగాత్రులను సమీపంలోని హార్బర్ వ్యూ మెడికల్ సెంటర్‌కు తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నాయి. కాగా, గాయపడిన వారిలో ఒక రెండేళ్ల పసిబాలుడు కూడా ఉండటం స్థానికంగా తీవ్ర కలచివేస్తోంది.

ఆదివారం సాయంత్రం వేళ ఘాతుకం సియాటెల్‌లో 'బైట్ ఆఫ్ సియాటెల్' పేరిట ప్రతి ఏటా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం 1982 నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకల సందర్భంగా నగరంలో వందలాది ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు, పెద్ద ఎత్తున మ్యూజిక్ ఈవెంట్లు నిర్వహిస్తుంటారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవానికి సుమారు 3.5 లక్షల మందికి పైగా జనం హాజరవుతుంటారు. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో వేడుకలు కోలాహలంగా సాగుతుండగా, ఒక్కసారిగా ఈవెంట్ వేదిక లోపలి నుంచి పలుమార్లు తుపాకీ పేలుడు శబ్దాలు వినిపించాయి. దీంతో అక్కడ ఉన్న వందలాది మంది సందర్శకులు భయాందోళనలతో చెల్లాచెదురుగా పరుగులు తీశారు.

కొనసాగుతున్న దర్యాప్తు: ఎవరూ పట్టుబడలేదు సియాటెల్ సెంటర్ వేదికగా జరిగిన ఈ కాల్పుల ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా ప్రజలు ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన దుండగులకు సంబంధించి ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని, నిందితుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# నీట్‌లో తక్కువ మార్కులతో ఇద్దరు ఆత్మహత్య..

బలగం టీవీ, న్యూఢిల్లీ

నీట్ పరీక్షలో ఆశించిన మార్కులు రాకపోవడంతో ఇద్దరు విద్యార్థినులు తీవ్ర మనస్తాపానికి గురైన ఘటనలు మహారాష్ట్ర, తెలంగాణలో చోటుచేసుకున్నాయి. మహారాష్ట్రలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా, తెలంగాణలో మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.

మహారాష్ట్రలోని అహల్యానగర్ జిల్లా జలాల్‌పూర్ గ్రామానికి చెందిన అంకితా సాంగ్లే నీట్ పరీక్షలో కేవలం 166 మార్కులు రావడంతో తీవ్ర నిరాశకు గురైంది. గత శనివారం ఇంట్లోనే ఆమె ఆత్మహత్య చేసుకోగా, అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. సంఘటనా స్థలంలో లభించిన మరాఠీ భాషలో రాసిన లేఖలో.. "నా కోసం మీరు ఎంతో త్యాగం చేశారు. కానీ మీ ఆశలను నెరవేర్చలేకపోయాను" అని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ లేఖను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇదిలా ఉండగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన పాగే కృష్ణవేణి కూడా నీట్‌లో ఆశించిన మార్కులు రాకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను భూపాలపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# బీజేపీ యువమోర్చా నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం : బుర్ర శేఖర్ గౌడ్

బలగం టివి, వేములవాడ;

బీజేపీ యువమోర్చా నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వేములవాడ అర్బన్ బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ అన్నారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. యువమోర్చా చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడడం దాని వైఫల్యాలకు నిదర్శనమని విమర్శించారు.

ఎన్ని ముందస్తు అరెస్టులు చేసినా బీజేపీ నాయకత్వం, కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాటాల నుంచి వెనక్కి తగ్గబోరని స్పష్టం చేశారు. విద్యార్థులు, యువత, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. "అరచేతిని అడ్డం పెట్టి సూర్యకాంతిని ఆపలేరు" అని వ్యాఖ్యానించారు.

రానున్న రోజుల్లో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ మరింత ఉధృతంగా పోరాటాలు చేపడుతుందని తెలిపారు. ఇప్పటివరకు అనేక ప్రజా ఉద్యమాల్లో బీజేపీ ముందుండి పోరాడిందని, భవిష్యత్తులో తెలంగాణలో మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామని బుర్ర శేఖర్ గౌడ్ పేర్కొన్నారు.

# ఇరాన్ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ బాంబుల వర్షం!

**కాస్పియన్ సముద్రంలో ఉక్రెయిన్ అనూహ్య దాడి.. రష్యా యుద్ధనౌకే లక్ష్యంగా కీవ్ వ్యూహం**

**ఒక నావికుడు మృతి.. తీవ్ర పరిణామాలు తప్పవని ఇరాన్ ఘాటు హెచ్చరిక**



బలగం టీవీ, కీవ్/టెహ్రాన్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధ జ్వాలలు కాస్పియన్ సముద్రానికీ వ్యాపించాయి. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన కాస్పియన్ సముద్రంలో ఇరాన్‌కు చెందిన ఒక వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ సైన్యం అనూహ్యంగా విరుచుకుపడింది. డ్రోన్లు, క్షిపణులతో జరిపిన ఈ సుదూర దాడిలో ఇరాన్ నౌక తీవ్రంగా దెబ్బతినగా, ఒక నావికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో నావికుడు తీవ్రంగా గాయపడినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కాస్పియన్ సీ పరిధిలోని రష్యా సైనిక సదుపాయాలు, సరఫరా గొలుసులను (సప్లై చైన్) పూర్తిగా దెబ్బతీసే లక్ష్యంతోనే తాము ఈ సుదూర దాడులు నిర్వహించినట్లు ఉక్రెయిన్ రాజధాని కీవ్ అధికారికంగా ప్రకటించింది.

**ఉక్రెయిన్ వివరణ**

ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ప్రత్యేకంగా స్పందించారు. రష్యాకు సైనిక సరకులు, ఆయుధాలు చేరవేసే మార్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ సుదూర దాడులు చేసినట్లు స్పష్టం చేశారు. రష్యా వ్యతిరేకంగా ఉక్రెయిన్ దళాలు ఈ దాడులను కొనసాగిస్తున్నాయని, అందులో భాగంగానే అక్కడ మోహరించిన ఒక రష్యా యుద్ధనౌకను, సైనిక సరుకు రవాణా నౌకలను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు జెలెన్‌స్కీ ప్రకటించారు. అయితే, రష్యాకు ఆయుధాలు చేరవేసే ఈ నౌకల సమూహంలో ఇరాన్‌కు చెందిన వాణిజ్య నౌక కూడా ఉండటం గమనార్హం.

ఐరాస నియమావళికి విరుద్ధం: ఇరాన్ ఆగ్రహం తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ దళాలు దాడి చేయడాన్ని ఇరాన్ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ చర్య అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి నియమావళిని ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనని మండిపడింది. ఈ రెచ్చగొట్టే దాడికి ఉక్రెయిన్ భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఘాటుగా హెచ్చరించారు. "రష్యా-ఉక్రెయిన్ సంఘర్షణలో ఇరాన్ ఎన్నడూ జోక్యం చేసుకోలేదు. ఈ దాడి ద్వారా ఉక్రెయిన్ ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఆర్టికల్ 2(4)ను ప్రత్యక్షంగా ఉల్లంఘించింది. మా జాతీయ ప్రయోజనాలు, భద్రతను కాపాడుకోవడానికి మేము ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోం" అని స్పష్టం చేశారు. ఈ నేరపూరిత చర్యకు ఉక్రెయిన్ పాలకులను జవాబుదారీగా నిలబెట్టాలని ఐరాస భద్రతా మండలి, ఐరోపా దేశాలను అరాఘ్చి కోరారు. ఒకవేళ భవిష్యత్తులో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమైతే, దానికి ఉక్రెయిన్ మరియు దానికి మద్దతు ఇస్తున్న పశ్చాత్య దేశాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

యూరోపియన్ యూనియన్‌తో ఇరాన్ అత్యవసర చర్చలు దాడి ఘటనపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వేగంగా దౌత్యరంగంలోకి దిగారు. యూరోపియన్ యూనియన్ (EU) విదేశాంగ విధాన చీఫ్ కజా కల్లాస్‌తో ఆయన ఫోన్‌లో అత్యవసరంగా మాట్లాడారు. ఉక్రెయిన్ అనాలోచిత దాడిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన అరాఘ్చి, అంతర్జాతీయ సమాజం ఈ ఘాతుకాన్ని కఠినంగా ఖండించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో, పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధి ప్రాంతంలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలను తగ్గించేందుకు దౌత్యపరమైన చర్చల అవసరాన్ని ఇరువురు నేతలు గుర్తించారు. శాంతియుత దౌత్య పరిష్కారాల ద్వారానే పరిస్థితిని అదుపులోకి తేవాలని ఇరాన్ అభిప్రాయపడింది.

[బాక్స్ ఐటమ్] సుదూర తీరాలపై కీవ్ పంజా! రష్యా సైనిక వ్యూహాలను దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ తన దాడుల పరిధిని ఊహించని రీతిలో విస్తరించింది. జెలెన్‌స్కీ తెలిపిన వివరాల ప్రకారం ఉక్రెయిన్ దళాలు ఒకేసారి పలు రష్యా ప్రాంతాలపై పంజా విసిరాయి:

కిరోవ్ ప్రాంతంలోని రష్యా ఆయుధ కర్మాగారం
త్యూమెన్‌లోని కీలక ఆయిల్ రిఫైనరీ
యెకాటెరిన్‌బర్గ్‌లోని ప్రధాన లాజిస్టిక్స్ కేంద్రం
కాస్పియన్ సముద్రంలోని సైనిక సరకు రవాణా నౌకలు

రష్యాకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఆర్థిక, సైనిక వనరులను తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఈ దాడులు సాగుతున్నట్లు ఉక్రెయిన్ ధ్రువీకరించింది.

# చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,:



చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ లో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026 భాగంగా చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసే విధానాలకు సంబంధించి నాలుగు రకాల చెత్త డబ్బాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం వద్ద సోమవారం ఏర్పాటు చేయగా, కలెక్టర్ పరిశీలించారు. ఆకుపచ్చ డబ్బా తడి చెత్త కోసం.. నీలం కలర్ డబ్బా పొడి చెత్త కోసం.. ఎరుపు డబ్బా శానిటరీ చెత్త కోసం. నలుపు రంగు డబ్బా హానికరమైన ప్రత్యేకమైన చెత్త కొరకు ఉపయోగించాల్సిందిగా తెలియజేసేందుకు ఏర్పాటు చేశారు. చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని,ప్రతి ఒక్కరూ ఇంటి వద్దే చెత్తను విభజించి గ్రామపంచాయతీ వాహనాలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.సుప్రీంకోర్టు ఆర్డర్స్ ప్రకారం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026 ను అందరూ పాటించి చెత్తను సరైన విధానంలో నిర్వహణ చేసి గ్రామాలను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్***

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:



సీఎంఆర్ లక్ష్యం ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీ, యాక్షన్ ప్యాడీ బకాయిల చెల్లింపు, గత సీజన్ల సీఎంఆర్ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, బాయిల్, రా రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఎఫ్ సీ ఐ అధికారి తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లులకు రోజు వారీ లక్ష్యాలు నిర్ణయించి, వాటిపై సమీక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఏ రైస్ మిల్స్ లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయో గుర్తించాలని, నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

యాక్షన్ ప్యాడీ బకాయిలు గడువులోగా చెల్లించాలని స్పష్టం చేశారు. గత సీజన్ల సీ ఎంఆర్ ఇవ్వడంలో జాప్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కచ్చితంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమావేశంలో ఎఫ్సీఐ డీఎం రవి ప్రకాశ్, అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే



**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 17 ఫిర్యాదులు స్వీకరణ..**

**-ఎస్పీమహేష్ బి.గితే.**

బలగం టీవీ,రాజన్నసిరిసిల్ల :

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీమహేష్ బి.గితే తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ఆఫీస్ లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 17 ఫిర్యాదులను ఎస్పీమహేష్ బి.గితే స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ ఎస్పీమహేష్ బి.గితే మాట్లాడుతూ. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

# తమిళనాడు, పుదుచ్చేరిల్లో 31 నుంచి చికెన్ అమ్మకాల నిలిపివేత!

**నిరవధిక బంద్‌కు వ్యాపారుల పిలుపు**

బలగం టీవీ, చెన్నై

తమిళనాడు, పుదుచ్చేరిల్లోని చికెన్ ప్రియులకు నిరాశ కలిగించే వార్త. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే జూలై 31 నుంచి చికెన్ విక్రయాలను నిరవధికంగా నిలిపివేయనున్నట్లు తమిళనాడు చికెన్ ట్రేడర్స్ ఫెడరేషన్ సంచలన ప్రకటన చేసింది. బ్రాయిలర్ కంపెనీలు ప్రభుత్వ ఫీడింగ్ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో ఆటలాడుతుండటమే ఈ కఠిన నిర్ణయానికి కారణమని సమాఖ్య స్పష్టం చేసింది. ఈ బంద్‌కు పొరుగున ఉన్న పుదుచ్చేరి చికెన్ వ్యాపారులు కూడా పూర్తి మద్దతు ప్రకటించడంతో, రెండు ప్రాంతాల్లోనూ చికెన్ లభ్యతపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

తమిళనాడు చికెన్ ట్రేడర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బి. దురైరాజ్ సోమవారం ఈ బంద్ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఫారంల నుంచి కోళ్లను రవాణా చేయడానికి కనీసం 12 గంటల ముందే వాటికి మేత వేయడం ఆపివేయాలి. దీనిని శాస్త్రీయంగా "ఫీడ్ విత్‌డ్రాయల్" అని పిలుస్తారు. అయితే, బ్రాయిలర్ కంపెనీలు ఈ నియమాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కోళ్లను వాహనాల్లోకి ఎక్కించే చివరి నిమిషం వరకు మేత వేయడం వల్ల, రవాణా సమయంలో కోళ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ఇది ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదకరమని దురైరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కంపెనీలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోవడంతోనే విక్రయాల నిలిపివేతకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

కోళ్లను వధకు పంపే ముందు 8 నుంచి 12 గంటల పాటు మేతను నిలిపివేయడం అనేది అంతర్జాతీయ ఆహార భద్రతలో ఒక కీలకమైన ప్రక్రియ.ఇలా చేయడం వల్ల కోళ్ల జీర్ణాశయం దాదాపుగా ఖాళీ అవుతుంది. ఫలితంగా రవాణా, ప్రాసెసింగ్ సమయంలో కోడి వ్యర్థాలు మాంసానికి అంటుకునే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. తద్వారా సాల్మొనెల్లా వంటి హానికారక బ్యాక్టీరియాలు వ్యాపించకుండా నిరోధించవచ్చు.కానీ కంపెనీలు చివరి నిమిషం వరకు మేత వేయడం వల్ల కోళ్ల జీర్ణవ్యవస్థ నిండుగా ఉండి, ప్రయాణంలో ఒత్తిడికి గురై వ్యర్థాలు బయటకు వస్తున్నాయి. దీనివల్ల మాంసం కలుషితమయ్యే ప్రమాదం పెరుగుతోంది. వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన మాంసాన్ని అందించాలనే లక్ష్యంతోనే ఈ బంద్ చేపడుతున్నామని, కంపెనీలు నిబంధనలు పాటించే వరకు వెనక్కి తగ్గేదే లేదని వ్యాపారుల సమాఖ్య స్పష్టం చేసింది.

# సర్వాంగ సుందరంగా వేములవాడ పట్టణ అభివృద్ధి

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**- రూ.2.65 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ప్రారంభం**



బలగం టీవీ,వేములవాడ:

సర్వంగ సుందరంగా వేములవాడ పట్టణ అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..వేములవాడ పట్టణ బ్యూటిఫికేషన్‌లో భాగంగా రూ.2.65 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు ..ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటి, రెండో బైపాస్ రోడ్లలోని ప్రధాన ప్రాంతాల్లో 150 విద్యుత్ స్తంభాలు, 300 ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశామని చెప్పారు.మరో 82 విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కూడా అనుమతులు కోరామని, అవి కూడా త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. ఈ లైటింగ్ వ్యవస్థ వల్ల రాత్రి వేళల్లో భక్తులు, ప్రయాణికులకు మెరుగైన భద్రత లభిస్తుందని, వేములవాడ పట్టణం మరింత ఆకర్షణీయంగా మారుతుందని పేర్కొన్నారు.

80 అడుగుల ప్రధాన రహదారిపై కూడా ప్రత్యేక డిజైన్‌తో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నంది, త్రిశూలం ఆకృతులతో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి భక్తులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేపడుతున్నామని చెప్పారు.

తిప్పాపూర్ బస్టాండ్ ఆధునీకరణకు రూ.1.60 కోట్లు కేటాయించామని, అక్కడి నుంచి రాజన్న ఆలయానికి భక్తులు నేరుగా చేరుకునేలా కొత్త బ్రిడ్జి నిర్మిస్తున్నామని తెలిపారు. బస్టాండ్‌లో దిగిన ప్రయాణికులు సులభంగా ఆలయానికి చేరుకునేలా ప్రత్యేక మార్గాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో ఆలయ అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధికి ఇప్పటికే సుమారు రూ.150 కోట్లు వెచ్చించగా, తాజా నిధులతో కలిపి మొత్తం రూ.249.40 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే 45 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

వేములవాడ రాజన్న ఆలయాన్ని భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా నిర్మిస్తున్నామని తెలిపారు. ఆలయ నిర్మాణం మరో వందేళ్లు కాదు, వెయ్యేళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా స్థపతులు, ఆర్కిటెక్టులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని అన్నారు .

భారతదేశంలోని ప్రాచీన దేవాలయాలను పరిశీలించి వాటి నిర్మాణ శైలిని అధ్యయనం చేసిన నిపుణుల సూచనల మేరకు వేములవాడ ఆలయ అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ప్రతి నిర్మాణాన్ని ఆగమ శాస్త్రానికి అనుగుణంగా చేపడుతున్నామని తెలిపారు. ఒక నెల ఆలస్యమైనా నాణ్యత విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు.ఇటీవల శృంగేరి పీఠాధిపతి జగద్గురు శ్రీ విధుశేఖర భారతి స్వామీ ఆశీస్సులు తీసుకున్నామని, వారి సూచనల మేరకు విమాన గోపురం నిర్మాణం సహా మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు.వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో ఆలయ అభివృద్ధికి మరో రూ.99.40 కోట్లు అవసరమని వివరించామని, వెంటనే ప్రభుత్వం జీవో జారీ చేసి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. ఈ పనులపై సమీక్ష నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఓఎస్డీతో ప్రత్యేక సమావేశం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

గతంలో నిలిచిపోయిన బద్దిపోచమ్మ ఆలయం, టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన రూ.20 కోట్ల నిధులను తిరిగి సాధించామని విప్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో సమస్యను వివరించగా, వారంలోపే ఆ నిధులు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని చెప్పారు. ప్రస్తుతం బద్దిపోచమ్మ ఆలయం, భారీ శివుడి విగ్రహం, టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

# చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ..

**-ప్రజావాణికి ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే కలెక్టర్ స్పందన**
**-ఇటీవల ఎంజేపీ బాలుర విద్యాలయం ప్రిన్సిపాల్ సస్పెండ్**



బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులు, ఇతర సమస్యలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే స్పందించిన జిల్లా కలెక్టర్ ఆ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా, వారితో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? నాణ్యతా ఎలా ఉంది? అని ఆరా తీశారు. బియ్యం, పప్పులు, కోడిగుడ్లు, నూనె ఇతర ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. అక్కడి నుంచి విద్యార్థుల వసతి గదులకు వెళ్లి.. టాయిలెట్లు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**వెంటనే సమస్యలు పరిష్కరించాలి**

విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా ను పిలిపించి, కలెక్టర్ ఆదేశించారు.ఇటీవల జిల్లాలోని వేములవాడ మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి.. నిర్వహణలో లోపాలను గుర్తించారు. విచారణ నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ను జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.విద్యార్థులు, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతి పాఠ్యాంశం కీలకమని ప్రణాళిక ప్రకారం చదవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వసతులను సద్వినియోగం చేసుకొని.. విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవగాహనతో ఉండాలని స్పష్టం చేశారు.

# ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు తీసుకునే జాగ్రత్తలపై గ్రామలలో అవగాహన కార్యక్రమం



బలగంటీవీ,బోయినిపల్లి;

ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు తీసుకునే జాగ్రత్తల గురించి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వర్ధవెల్లి, జగ్గారావుపల్లి, బూరుగుపల్లి గ్రామలలో రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం రోజున నిర్వహించారు.

తహశీల్దర్ మాట్లాడుతూ: బోర్వెల్ ఉన్న ప్రతి ఒక్క సన్న, చిన్నకారు రైతు బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణాన్ని చేసుకోనీ, నీటిని ఆదా చేసుకోవాలి అని సూచించారు. ఏవో మాట్లాడుతూ: రైతులు తమ మొత్తం విస్తీర్ణంలో వరి సాగు చేయకుండా, కొంత భాగంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.తక్కువ నీటితో సాగు చేయగల కంది, పొద్దు తిరుగుడు, ఆముదం పంటలని ఆగస్టు 15 వరకు వేసుకోవచ్చు, ఆగస్టు 15 నుండి నువ్వు పంట వేసుకోవచ్చని తెలిపారు. ఏపీవో సబిత మాట్లాడుతూ: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వానచినుకుని సంరక్షించుకుంటేనే ప్రయోజనం ఉంటుంది కనుక వీబీజి రామ్ పథకం కింద రైతులు తమ బోర్ల చుట్టూ రీచార్జ్ గుంతలను తవ్వుకోవాలని, దీనికి అయ్యే ఖర్చు సుమారు 36000/- ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు 100 శాతం రాయితీపై అందచేస్తుందని తెలిపారు. పంట కుంటలు వరద నీటిని నిల్వ చేసుకోవడానికి ఒక గుంట స్థలం లో 72000/- రూపాయలతో 100 శాతం రాయితీ పై నిర్మించుకోవచ్చని, ప్రభుత్వ భూముల్లో, కొండ ప్రాంతాల్లో ఊరకుంట నిర్మాణాలు, ఇంటి నుండి వచ్చే మురుగు నీటిని ఆదా చేసుకోవడానికి ఇంకుడు గుంత 6,700 రూపాయల తో వీబీ జి రామ్ పథకం కింద నిర్మించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్ల శ్రీనివాస్ రెడ్డి, కొంకటి మధు, పెంచాల సౌమ్య తహశీల్దార్ జలీల్ మొహియుద్దీన్, వ్యవసాయ అధికారి ప్రణీత , ఏపీవో సబిత, ఏఈఓ లక్ష్మణ్, హరీష్, రవళి, ఏఈఈ ఇరిగేషన్, హెచ్ఈఓ సతీష్, పంచాయతీ కార్యదర్శి అంజలి, సౌజన్య, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**-శ్రామిక కార్మిక వర్గాలు, వ్యవసాయ కూలీలు,మరి యు ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలి**
**-తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం**
**- ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలి రోజువారి వేతనం 600 రూపాయలు చెల్లించాలి.**
**- మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి,, "విక సిత్ భారత్ గ్రామ్ జి"చట్టాన్ని రద్దు చేయాలి.**



బలగం టీవీ,బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో పత్రిక సమావేశం సందర్భంగా వచ్చే నెల 10, తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద, జైల్ భారో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరుగుతుంది.

కేంద్రంలో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో ఉన్నప్పుడు వామపక్షాల పోరాట ఫలితంగా"మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం"అమలు చేయబడ్డది. పోరాడి సాధించుకున్న వందరోజుల పనిని ఈరోజు కేంద్రంలో ఉన్న యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించి దీని స్థానంలో"వికసిత్ భారత్ గ్రామ్, జీ"(వి బి జి,రామ్ జీ) మార్పు చేయడమే కాక, రాష్ట్రాల వాటా 10, శాతం నుండి,40 శాతం నిధులను భరించాలని రాష్ట్రాల మీద భారం రు ద్దాలని,కేంద్ర ప్రభుత్వం ఇదే అదునుగా భావించి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ 100 రోజుల పనిని ఎత్తివేయాలని కుట్రలు చేస్తుంది. ఈ కుట్రలు తిప్పి కొట్టడానికి వచ్చేనెల ఆగస్టు 10, తేదీన సోమవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తలపెట్టిన జైల్ భరో కార్యక్రమానికి పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ ,కూలీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం పిలుపునివ్వడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్, మరియు రత్నంపేట గ్రామస్తులు రామంచ ప్రభాకర్, గోల్కొండ దేవయ్య, పర్లపల్లి అంజయ్య, ర్యాగల మొండయ్య, అత్తిన ఎర్రయ్య, బూత్కూరు రేణుక, గోన్ డ జ్యోతి, మేర భాగ్య, అత్తేన లచ్చవ్వ, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి 162 దరఖాస్తుల రాక..

**-అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ప్రజావాణికి 162 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 162 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందించి.. పరిష్కరించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

**ఆర్డీఓ కార్యాలయాల్లో..**

సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 7 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 1 దరఖాస్తు రాగా, సంబంధిత శాఖ అధికారికి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.




# ఉదారత చాటుకున్న గురువు

బలగం టీవీ, బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు గుండేటి చంద్రమౌళి (ఎస్.ఏ), పక్క గ్రామం గుండన్నపల్లి నుండి రోజు పాఠశాలకు 2 కిలో మీటర్లు నడిచి వస్తున్న విద్యార్థిని గుంట అనుశ్రీ కి (ఆరవ తరగతి) సైకిల్ కొనివ్వడం జరిగింది.

ఈ సందర్భంగా స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ: విద్యను బోధించే గురువులు విద్యార్థులకు విద్య బుద్దులు నేర్పడంతో పాటు వారి స్థితి గతుల గురించి, బాగోగుల గురించి ఆలోచించడం శుభ పరిణామం అన్నారు. అలాగే పాఠశాలకు సంబంధించి ఏ అవసరం ఉన్న నేను మరియు మా పాలకవర్గం అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్కూల్ విద్యార్థుల తరపున, గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చంద్రగిరి వెంకటేష్, గంగాధర గంగాజమున, చిలుముల శ్రీమణి, కొట్టపల్లి రమ్యశ్రీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# శ్రీ వాణి స్కూల్లో ఘనంగా మెహందీ ఫెస్ట్

బలగం, టీవీ ఇల్లంతకుంట

శ్రీ వాణి స్కూల్‌లో సోమవారం మెహందీ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని అందమైన మెహందీ డిజైన్లతో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమానికి స్కూల్ డైరెక్టర్ గణగోని శ్రీకాంత్, ప్రిన్సిపాల్ కొయ్యడ సత్యనారాయణ హాజరై పాల్గొన్న వారిని అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, కళాత్మక నైపుణ్యాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిల్ప, సుష్మ, మౌనిక, రేష్మ, స్వర్ణ, స్వప్న, రవళి, రేణుక, బాబు, శ్రీనివాస్, కరుణ, శ్రీలత, కవిత, ప్రతిభ, ఆకాంక్ష, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# గొలుసును లాక్కొనేందుకు ప్రయత్నించగా, బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు పరార్

బలగం టీవీ, బోయినిపల్లి;

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొనేందుకు ప్రయత్నించిన ఘటనపై బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారు కొండం విజయ తెలిపిన వివరాల ప్రకారం, 26-07-2026 మధ్యాహ్నం ఆమె కొదురుపాక గ్రామంలో నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో ఒంటరిగా ఉండగా, హెల్మెట్ ధరించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి ముందుగా సిగరెట్ కొనుగోలు చేసి వెళ్లాడు. అనంతరం అదే వ్యక్తి మళ్లీ వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొనేందుకు ప్రయత్నించగా, బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు ఏమీ దోచుకోకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేములవాడ రూరల్ సీఐ ఎం. శ్రీనివాస్ సోమవారం రోజున సంఘటనా స్థలాన్ని సందర్శించి, ఘటనపై పరిశీలన నిర్వహించి, బాధితురాలు మరియు స్థానికులను విచారించారు. నిందితుడిని త్వరితగతిన గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



## జిమ్నాస్టిక్స్‌లో మాన్య జోయ్స్ 'బంగారు' పంజా!

**రీజియన్ సీఐఎస్‌సీఈ గేమ్స్‌లో ఏకంగా 4 స్వర్ణాలు కైవసం**

**జాతీయ పోటీలకు అర్హత సాధించిన హైదరాబాద్ జిమ్నాస్ట్.. నైషాకు రజతాలు**

బలగం టీవీ, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్ సీఐఎస్‌సీఈ (CISCE) గేమ్స్ అండ్ స్పోర్ట్స్ లెవెల్ జిమ్నాస్టిక్స్ పోటీల్లో హైదరాబాద్ జిమ్నాస్ట్ మాన్య జోయ్స్ అద్భుత ప్రదర్శనతో సత్తా చాటింది. హోరాహోరీగా సాగిన ఈ టోర్నీలో ఏకంగా నాలుగు స్వర్ణ పతకాలను తన ఖాతాలో వేసుకుని సరికొత్త రికార్డు సృష్టించింది.

హైదరాబాద్ వేదికగా సోమవారం జరిగిన ఈ పోటీలలో మాన్య జోయ్స్ అండర్-14 విభాగంలో బరిలోకి దిగింది. తన అద్భుతమైన నైపుణ్యంతో హూప్, బాల్, క్లబ్స్, రిబ్బన్ ఆపరేటస్ విభాగాల్లో ప్రత్యర్థులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అన్నింటిలోనూ విజేతగా నిలిచి నాలుగు పసిడి పతకాలను ముద్దాడింది.

నేషనల్స్‌కు ఎంపిక.. ఈ అద్భుత విజయాలతో పాటు రిథమిక్ ఆల్‌రౌండ్ విభాగంలోనూ మాన్య జోయ్స్ టాప్ ప్లేస్ (ప్రథమ స్థానం) కైవసం చేసుకుంది. తద్వారా జాతీయ స్థాయి (నేషనల్స్) జిమ్నాస్టిక్స్ పోటీలకు సైతం ఆమె అధికారికంగా ఎంపికైంది.

మెరిసిన నైషా ఇదే టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన మరో జిమ్నాస్ట్ నైషా కూడా రాణించింది. అండర్-14 విభాగంలో హోరాహోరీగా సాగిన హూప్, బాల్ ఆపరేటస్ పోటీల్లో నైషా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండు రజత (సిల్వర్) పతకాలను సొంతం చేసుకుంది. విజేతలుగా నిలిచిన జిమ్నాస్ట్‌లను పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు అభినందించారు.



## ఇషా సింగ్ 'బంగారు' సంచలనం!

**ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో ఒలింపిక్ విజేత మనూ భాకర్‌పై ఘన విజయం**

**హైదరాబాదీ షూటర్ ఖాతాలో పసిడి పతకం.. మనూ భాకర్‌కు కాంస్యం**

బలగం టీవీ, హైదరాబాద్

అంతర్జాతీయ షూటింగ్ వేదికపై భారత యువ షూటర్, హైదరాబాదీ సంచలనం ఇషా సింగ్ మరోసారి పసిడి వెలుగులు విరజిమ్మింది. చైనాలోని హంగ్జూ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ (ISSF) వరల్డ్‌కప్‌లో ఈ 21 ఏళ్ల షూటర్ అద్భుత ప్రదర్శనతో సత్తా చాటింది. సోమవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో భారత్‌కే చెందిన స్టార్ షూటర్, ఒలింపిక్ విజేత మనూ భాకర్‌ను ఓడించి ఇషా సింగ్ సగర్వంగా స్వర్ణ పతకాన్ని కొల్లగొట్టింది.

హోరాహోరీగా సాగిన ఈ ఫైనల్ పోరులో మనూ కంటే మెరుగైన ప్రదర్శన కనబరిచిన ఇషా.. పోడియంపై అగ్రస్థానంలో నిలిచింది. కాగా, ఈ మెగా ఈవెంట్లో పసిడిపై కన్నేసిన మనూ భాకర్ చివరి నిమిషంలో నిరాశపరిచి కాంస్య (బ్రాంజ్) పతకంతో సరిపెట్టుకుంది.

ఆసియా క్రీడల జ్ఞాపకాలే నా బలమయ్యాయి: ఇషా సింగ్ ఇటీవలే మ్యూనిచ్‌లో జరిగిన టోర్నీలో అదిరే ప్రదర్శనతో రికార్డు పుస్తకాల్లోకి ఎక్కిన ఇషా సింగ్, తాజా విజయంపై సంతోషం వ్యక్తం చేసింది. మ్యాచ్ అనంతరం ఆమె మాట్లాడుతూ.. "మ్యూనిచ్‌లో పతకం గెలిచినందున ఈ మ్యాచ్‌లో నాపై ఒత్తిడి కాస్త ఎక్కువగా ఉంది. ఇలాంటి కీలక సమయంలోనే మనలోని అత్యుత్తమ ప్రదర్శనను బయటకు తీయాల్సి వస్తుంది. సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే హంగ్జూ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో పాల్గొన్న అనుభవం, అక్కడ నాలుగు పతకాలు సాధించిన మధుర జ్ఞాపకాలు ఈ మ్యాచ్‌లో నాకు మరింత బలమయ్యాయి" అని పేర్కొంది.

త్వరలో జరగనున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌తో పాటు, రాబోయే ఆసియా క్రీడలకు ముందు ఈ ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్‌లో గోల్డ్ మెడల్ సాధించడం ఇషా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## పాకిస్థాన్ 199/3

**రెండో రోజు ఆట ముగిసేసరికి వెస్టిండీస్ కంటే 112 పరుగులు వెనుకబాటు**

**రాణించిన షాన్ మసూద్ (88 నాటౌట్), ఇమామ్.. విఫలమైన కెప్టెన్ బాబర్ ఆజం**

బలగం టీవీ, హైదరాబాద్

వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్ నిలకడగా రాణిస్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్థాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. ప్రస్తుతం విండీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు కంటే పాక్ ఇంకా 112 పరుగుల వెనుకబడి ఉంది. క్రీజులో షాన్ మసూద్ (88; 137 బంతుల్లో 11 ఫోర్లు) ఒంటరి పోరాటం చేస్తుండగా, ఆల్‌రౌండర్ సల్మాన్ అఘా ఇంకా ఖాతా తెరవకుండా నాటౌట్‌గా ఉన్నారు.

పేలవ ఆరంభం.. ఇమామ్, మసూద్ ఆసరా తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్‌కు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. విండీస్ సీనియర్ బౌలర్ కెమర్ రోచ్ బౌలింగ్‌లో ఓపెనర్ అజాన్ ఒవైస్ పరుగులేమీ చేయకుండానే డకౌట్‌గా వెనుదిరిగాడు. అయితే ఆ తర్వాత మాజీ కెప్టెన్ షాన్ మసూద్, మరో ఓపెనర్ ఇమామ్-ఉల్-హక్ (63) జట్టును అద్భుతంగా ఆదుకున్నారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు అత్యంత కీలకమైన 155 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి పాక్‌ను బలీయమైన స్థితికి చేర్చారు.

కెప్టెన్‌గా తిరిగొచ్చినా.. నిరాశపరిచిన బాబర్! దాదాపు మూడేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం (జులై 2023 తర్వాత) టెస్ట్ క్రికెట్లో పాక్ కెప్టెన్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం ఈ ఇన్నింగ్స్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయాడు. క్రీజులోకి వచ్చిన కాసేపు 3 ఫోర్లతో మంచి ఫామ్‌లోనే కనిపించినప్పటికీ, 38 బంతుల్లో 23 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. కాగా, బాబర్ ఆజం తన చివరి టెస్ట్ సెంచరీని దాదాపు నాలుగేళ్ల క్రితం న్యూజిలాండ్‌పై కరాచీలో సాధించాడు. ఇప్పటివరకు 63 టెస్టుల్లో 42.49 సగటుతో 9 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలతో కలిపి 4504 పరుగులు చేశాడు.

విండీస్ 311 ఆలౌట్.. మహమ్మద్ అలీ 'నాలుగు' వికెట్లు అంతకుముందు, వెస్టిండీస్ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. విండీస్ బ్యాటర్లలో వికెట్ కీపర్ షాయ్ హోప్ (92), కావెమ్ హాడ్జ్ (84) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌లతో జట్టుకు మంచి స్కోరు అందించారు. పాకిస్థాన్ బౌలర్లలో ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ □□ అద్భుత స్పెల్‌తో 50 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, మహమ్మద్ అబ్బాస్ 63 పరుగులకు 3 వికెట్లు దక్కించుకున్నాడు.

# రింగులోనూ పాక్‌పై భారత్ పంజా!

**కామన్వెల్త్ గేమ్స్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన బాక్సర్ జాదుమణి**

**విజయాన్ని కార్గిల్ వీరులకు అంకితం చేసిన మణిపూర్ వీరుడు**

బలగం టీవీ, న్యూఢిల్లీ



గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత బాక్సర్లు అదరగొడుతున్నారు. పురుషుల బాక్సింగ్ 55 కేజీల విభాగంలో భారత యువ సంచలనం, మణిపూర్ బాక్సర్ జాదుమణి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. హోరాహోరీగా సాగుతుందనుకున్న ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో 22 ఏళ్ల జాదుమణి 5-0తో పాకిస్థాన్‌కు చెందిన సుమామ రెహమాన్‌ను దారుణంగా మట్టికరిపించాడు. రింగులో పాక్ బాక్సర్‌కు కనీస అవకాశం ఇవ్వకుండా పంచ్‌ల వర్షం కురిపించిన జాదుమణి, ఏకపక్ష విజయంతో భారత్‌కు పతక ఆశలను సజీవంగా ఉంచాడు.

తొలి రౌండ్‌లో 'బై' దక్కడంతో పాకిస్థాన్ బాక్సర్ సుమామ రెహమాన్ నేరుగా ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టినప్పటికీ, భారత బాక్సర్ వేగానికి, పవర్ పంచ్‌లకు తలవంచక తప్పలేదు. ఈ పోరులో పాక్ అభ్యర్థి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయాడు. కార్గిల్ దివస్ నాడే పాక్‌పై జయభేరి! 1999 కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన చారిత్రాత్మక విజయానికి గుర్తుగా ప్రతీ ఏడాది జులై 26న 'కార్గిల్ విజయ్ దివస్' నిర్వహిస్తారన్న సంగతి తెలిసిందే. సరిగ్గా ఇదే రోజున భారత బాక్సర్ జాదుమణి పాకిస్థాన్ ప్రత్యర్థిని రింగులో చిత్తు చేయడం విశేషం. ఈ సంచలన విజయానంతరం జాదుమణి మాట్లాడుతూ.. "మన కార్గిల్ హీరోలకు నా ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నా. కార్గిల్ విజయ్ దివస్ నాడు పాకిస్థాన్ బాక్సర్‌ను ఓడించినందుకు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. క్వార్టర్ ఫైనల్స్‌లోనూ ఇదే మెరుగైన ప్రదర్శనను కొనసాగిస్తా. దేశానికి బంగారు పతకం అందించడమే నా ఏకైక లక్ష్యం" అని ధీమా వ్యక్తం చేశాడు.

ప్రస్తుతం బాక్సింగ్‌లో జాదుమణి క్వార్టర్స్‌కు చేరడంతో పాటు, ఇతర బాక్సర్లు కూడా ఫామ్‌లో ఉండటంతో రింగులో భారత్‌కు మరిన్ని పతకాలు వచ్చే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

**క్వార్టర్స్‌కు అంకుశ్, సచిన్, సాక్షి**

కామన్వెల్త్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో భారత బాక్సర్లు అంకుశ్, సచిన్ సివాచ్, సాక్షి చౌదరి తమ ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయిస్తూ క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

సోమవారం జరిగిన పురుషుల 60 కిలోల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో సచిన్ సివాచ్ 4-1 తేడాతో ఇంగ్లండ్‌కు చెందిన విలియమ్ హ్యూవిట్‌పై విజయం సాధించి చివరి-8లోకి అడుగుపెట్టాడు.

పురుషుల 80 కిలోల విభాగంలో భారత బాక్సర్ అంకుశ్ ఏకపక్ష పోరులో అంటిగ్వా అండ్ బార్బుడాకు చెందిన జన్ జాలన్‌ను 5-0తో చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు.

మహిళల 51 కిలోల విభాగం ప్రిక్వార్టర్స్‌లో సాక్షి చౌదరి బోట్స్‌వానాకు చెందిన లెథబొ మొడుకనెలెపై 5-0తో అలవోక విజయం నమోదు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. భారత బాక్సర్లు ప్రదర్శించిన ఈ విజయాలతో పతకాలపై ఆశలు మరింత బలపడ్డాయి.

# ఆరు పతకాలతో భారత్ జోరు!

**ఒక స్వర్ణం, మూడు రజతాలు, రెండు కాంస్యాలు కైవసం**

**చరిత్ర సృష్టించిన మీరాబాయి చాను.. బాక్సింగ్‌లో లవ్లీనాకు పతకం ఖాయం**

బలగం టీవీ, న్యూఢిల్లీ

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతున్నారు. జులై 23న ప్రారంభమై ఆగస్టు 2 వరకు సాగనున్న ఈ ప్రతిష్ఠాత్మక మెగా ఈవెంట్‌లో భారత్ తరఫున మొత్తం 122 మంది అథ్లెట్లు వివిధ విభాగాలలో పతకాల కోసం పోటీ పడుతున్నారు. ఇప్పటివరకు అందిన తాజా సమాచారం ప్రకారం భారత్ ఖాతాలో మొత్తం 6 పతకాలు చేరాయి. ఇందులో ఒక స్వర్ణం, మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలు ఉన్నాయి.

వెయిట్‌లిఫ్టర్ల పతకాల పంట! భారత వెయిట్‌లిఫ్టర్లు ఈసారి కూడా తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను మహిళల 48 కేజీల విభాగంలో పసిడి పతకాన్ని ముద్దాడి, కామన్వెల్త్ గేమ్స్‌లో వరుసగా మూడోసారి టైటిల్ గెలిచి హాట్రిక్ సాధించింది. కాగా, పురుషుల 60 కేజీల విభాగంలో రిషికాంత సింగ్ స్నాచ్‌లో సరికొత్త గేమ్స్ రికార్డు సృష్టిస్తూ భారత్‌కు తొలి రజతాన్ని అందించాడు.

మరోవైపు పారా పవర్ లిఫ్టింగ్‌లో జాండు కుమార్ కాంస్య పతకం సాధించి గ్లాస్గో గేమ్స్‌లో భారత్ పతకాల ఖాతాను తెరిచాడు. వీరితో పాటు ముత్తుపాండి రాజా, జ్ఞానేశ్వరి యాదవ్ రజతాలతో మెరవగా, బింద్యారాణి దేవి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

లవ్లీనాకు పతకం ఖాయం.. భారత స్టార్ బాక్సర్, ఒలింపిక్ పతక విజేత లవ్లీనా బొర్గొహైన్‌కు ఈ గేమ్స్‌లో పతకం ఖాయమైంది. మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనాకు క్వార్టర్ ఫైనల్‌లో 'బై' దక్కడంతో ఆమె నేరుగా సెమీఫైనల్‌కు చేరుకుంది. బాక్సింగ్ నిబంధనల ప్రకారం సెమీస్‌లో ఓడిన ఇద్దరికీ కాంస్య పతకాలు ఇస్తారు కాబట్టి లవ్లీనాకు పతకం గ్యారెంటీ అయింది. అయితే ఆమె ఈ పతకాన్ని స్వర్ణంగా మార్చాలనే పట్టుదలతో ఉంది.

కామన్వెల్త్ గేమ్స్ 2026: భారత పతక విజేతలు

1.
జాండు కుమార్
పారా పవర్ లిఫ్టింగ్ (మెన్స్ హెవీవెయిట్)
కాంస్యం

2.
రిషికాంత సింగ్

వెయిట్‌లిఫ్టింగ్ (పురుషుల 60 కేజీలు)
రజతం

3.
మీరాబాయి చాను

వెయిట్‌లిఫ్టింగ్ (మహిళల 48 కేజీలు)
స్వర్ణం

4.
ముత్తుపాండి రాజా

వెయిట్‌లిఫ్టింగ్ (పురుషుల 65 కేజీలు)
రజతం

5.
జ్ఞానేశ్వరి యాదవ్

వెయిట్‌లిఫ్టింగ్ (మహిళల 53 కేజీలు)
రజతం

6.
బింద్యారాణి దేవి

వెయిట్‌లిఫ్టింగ్ (మహిళల 58 కేజీలు)
కాంస్యం



## రజత వీరుడు ముత్తుపాండికి రూ. 30 లక్షల నజరానా!

**ప్రకటించిన తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్**

**కామన్వెల్త్ గేమ్స్ వెయిట్‌లిఫ్టింగ్‌లో 286 కిలోల బరువు ఎత్తి సిల్వర్ మెడల్ కైవసం**

బలగం టీవీ, న్యూఢిల్లీ

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్-2026లో రజత పతకంతో సంచలనం సృష్టించిన భారత వెయిట్‌లిఫ్టర్ రాజా ముత్తుపాండిపై తమిళనాడు ప్రభుత్వం నజరానాల వర్షం కురిపించింది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న పురుషుల 65 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో రజత పతకం (సిల్వర్ మెడల్) సొంతం చేసుకున్న రాజా ముత్తుపాండికి రూ. 30 లక్షల నగదు బహుమతిని (క్యాష్ ప్రైజ్) అందిస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన విజేతకు అభినందనలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.

తమిళనాడుకు గర్వకారణం: సీఎం విజయ్ "కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 65 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ కేటగిరిలో సిల్వర్ మెడల్ గెలిచిన రాజా ముత్తుపాండికి నా హృదయపూర్వక అభినందనలు. ఆయన సాధించిన ఈ అద్భుత విజయం తమిళనాడుకు ఎంతో గర్వకారణం. ఈ గెలుపు రాష్ట్ర యువతకు స్ఫూర్తిగా నిలవాలి. రాజా ముత్తుపాండి భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలని కోరుకుంటున్నాను" అని సీఎం విజయ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

తొలి ప్రయత్నంలో విఫలమైనా.. పట్టుదలతో రజతం వైపు! తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాకు చెందిన రాజా ముత్తుపాండి ఈ పోటీల్లో అద్భుతమైన పోరాట పటిమను కనబరిచాడు. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో.. స్నాచ్ విభాగంలో ముత్తుపాండి తన తొలి ప్రయత్నంలో 126 కిలోలు ఎత్తడంలో విఫలమయ్యాడు. అయితే ఒత్తిడికి లోనవ్వకుండా రెండో ప్రయత్నంలో 126 కిలోలను విజయవంతంగా ఎత్తి క్లియర్ చేశాడు. మూడో ప్రయత్నంలో 129 కిలోల బరువును ఎత్తలేకపోయాడు.

ఆ తర్వాత జరిగిన క్లీన్ అండ్ జెర్క్ విభాగంలోనూ తొలి ప్రయత్నంలో 158 కిలోలు ఎత్తడంలో విఫలమైనప్పటికీ, ఆ వెంటనే పుంజుకుని రెండో ప్రయత్నంలో 160 కిలోలను అవలీలగా ఎత్తాడు. దీంతో స్నాచ్‌లో 126 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 160 కిలోలతో కలిపి మొత్తం 286 కిలోల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచి దేశానికి సగర్వంగా రజత పతకాన్ని అందించాడు.

## వందేళ్ల నాటి ఇంట్లో గుప్త నిధుల కలకలం!

బలగం టీవీ, న్యూఢిల్లీ




బ్రిటన్‌కు చెందిన ఒక మధ్యతరగతి దంపతులను ఊహించని అదృష్టం వరించింది. వారు నివసిస్తున్న వందేళ్ల నాటి పురాతన నివాసంలో భారీ మొత్తంలో పాత కరెన్సీ నోట్లు లభ్యమవడం స్థానికంగా పెద్ద సంచలనంగా మారింది. ఇంటి సెల్లార్‌లో చాలా కాలంగా మూలన పడి ఉన్న ఒక పాత పెయింట్ డబ్బాలో ఈ నగదు దొరకడంతో ఆ దంపతులు ఒక్కసారిగా విస్మయానికి గురయ్యారు. ఈ అరుదైన ఘటనను వారు వీడియో తీసి ప్రముఖ సామాజిక మాధ్యమం 'టిక్‌టాక్'లో పోస్ట్ చేయగా, అది ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

మెట్ల కింద రహస్య ప్రదేశంలో.. బ్రిటన్‌కు చెందిన లూయిసా, డాన్ అనే దంపతులు 1900ల కాలంలో నిర్మించిన ఒక పురాతన ఇంట్లో నివసిస్తున్నారు. ఇటీవల వారు తమ ఇంటి సెల్లార్‌లోకి వెళ్లే మెట్ల కింద ఇటుకలతో మూసివేసి ఉన్న ఒక రహస్య ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో వారికి పురుగులతో నిండిన ఓ పాత పెయింట్ డబ్బా కనిపించింది. దాని నుంచి తీవ్రమైన ఘాటు వాసన వస్తుండటంతో, ప్రమాదకరమైన రసాయనాలు ఉండవచ్చనే అనుమానంతో వారు కొన్ని నెలల పాటు దాన్ని ముట్టుకోకుండా పక్కన పెట్టేశారు. అయితే, ఇటీవల ధైర్యం చేసి ఆ డబ్బాను తెరిచి చూడగా వారి కళ్లు బైర్లు కమ్మాయి. అందులో 1970వ దశకానికి చెందిన పాత నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. వాటి విలువ 1,000 పౌండ్లకు పైగా (భారత కరెన్సీలో సుమారు రూ. 1.27 లక్షలు) ఉంటుందని వారు గుర్తించారు.

ఆర్థిక కష్టాల్లో ఆదుకున్న 'లక్' ఈ గుప్త నగదు లభించిన సమయంలో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటం గమనార్హం. లూయిసాకు ఉద్యోగం లేకపోవడంతో కుటుంబ భారం మోయడం కష్టంగా మారిన తరుణంలో దొరికిన ఈ డబ్బు తమకు దేవుడు ఇచ్చిన వరమని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. "ఆ పాత డబ్బాలో ఇంత భారీ మొత్తంలో నగదు ఉంటుందని మేము అస్సలు ఊహించలేదు. చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఈ డబ్బు మాకు చేతికి అందింది. దీనితో నిలిచిపోయిన కొన్ని ఇంటి బిల్లులు చెల్లించగలిగాము. పిల్లలకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేశాము. ఈ అదృష్టం వల్ల మాపై ఉన్న ఆర్థిక ఒత్తిడి చాలా వరకు తగ్గింది" అని లూయిసా ఉద్వేగంతో పేర్కొన్నారు.

## బరువు నియంత్రణే అతిపెద్ద సవాల్

**రెండు రోజులుగా ఏమీ తినలేదు..**

**మూడు రోజులుగా నీళ్లు కూడా తాగలేదు: మీరాబాయి చాను**

బలగం టీవీ, న్యూఢిల్లీ

కామన్వెల్త్ గేమ్స్‌లో భారతదేశానికి తొలి స్వర్ణ పతకం అందించిన స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను పోటీలకు ముందు బరువు నియంత్రణ కోసం పడిన కష్టాలను వెల్లడించింది. మహిళల 48 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకుంది. ‘త్వరగా ముగించండి.. రెండు రోజులుగా ఏమీ తినలేదు. ఈ పోటీల కోసం బరువును నియంత్రణలో ఉంచుకోవడం నాకు అతిపెద్ద సవాల్‌గా మారింది. ఇది నాకే కాదు, ప్రతి అథ్లెట్‌కు ఎంతో కఠినమైన పరీక్ష’ అని మీరాబాయి పేర్కొంది. తాను సాధారణంగా 50.5 కిలోల బరువు ఉంటానని, 49 కిలోలకు తగ్గడం పెద్ద సమస్యగా అనిపించలేదని, అయితే 48 కిలోల విభాగంలో పోటీపడేందుకు మరింత కఠినంగా శ్రమించాల్సి వచ్చిందని తెలిపింది. అందుకోసం రెండు రోజులుగా ఆహారం తీసుకోలేదని, మూడు రోజులుగా చుక్క నీరు కూడా తాగలేదని వెల్లడించింది. ‘నా శరీరంలో బరువు తగ్గించుకునేందుకు ఇక అవకాశం కూడా లేకుండా పోయింది’ అంటూ ఆమె వ్యాఖ్యానించింది. వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, బాక్సింగ్ వంటి బరువు విభాగాల క్రీడల్లో నిర్దేశిత బరువును కచ్చితంగా పాటించడం అత్యంత కీలకమని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు.